క్లుప్తంగా

8న వెలుగొండలో వస్తు విక్రయ వేలం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు ఈనెల 8వ తేదీన ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. మార్చి 13 నుంచి 25వ తేదీ వరకు పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయలు విక్రయించేందుకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, అలాగే బ్రహ్మోత్సవాల ముందు రోజు నుంచి వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల ముందు వరకు తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని చెప్పారు. వేలం పూర్తయిన వెంటనే హక్కుదారులు నిర్ణీత రుసుం మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివరాలకు 80999 49996ను సంప్రదించాలని ఈఓ సూచించారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బేస్తవారిపేట: మండలంలోని గంటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ షేక్ నీలోఫర్ బేగమ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని కార్యకర్తలకు స్పష్టం చేశారు. చిన్నారుల ఎత్తు, బరువును కొలత వేసి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్తోపాటు అంగన్‌వాడీ కార్యకర్త మేరి పాల్గొన్నారు.

మహాప్రస్థానం అభివృద్ధికి ఆర్థిక సాయం

తర్లుపాడు: స్థానిక హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి తర్లుపాడుకు చెందిన పెరుమాళ్ల బాల మోహన్‌రావు రూ.61,127 ఆర్థికసాయం బుధవారం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు. మహాప్రస్థానంలో పలు అభివృద్ధి పనులు నిర్మాణ దశలో ఉన్నాయనీ, వాటిని పూర్తి చేసేందుకు దాతలు సహకరించాలని సామాజిక కార్యకర్త కశ్శెట్టి జగన్‌బాబు కోరారు.

శాఖా గ్రంథాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

తర్లుపాడు: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఆదిలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2024–25 వార్షిక రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఎక్కువ శాతం సభ్యులను చేర్చాలని, విద్యార్థులు వచ్చేలా ప్రోత్సహించాలని లైబ్రేరియన్ సుబ్బారెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యదర్శిని స్థానిక సిబ్బంది, పాఠకులు సన్మానించారు.

గ్రంథాలయానికి స్టీల్ ర్యాకుల వితరణ

గిద్దలూరు రూరల్: యశ్వంత్ ఎడ్యుకేషనల్ సంస్థ అధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయగ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ తన సొంత నిధులతో పట్టణంలోని గ్రంథాలయానికి స్టీల్ ర్యాకులు బుధవారం అందజేశారు. దాతల సహకారంతో ప్రతి వస్తువును సద్వినియోగం చేసుకుంటామని గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి తెలిపారు.

హౌసింగ్ ఏఈగా పోలయ్య


ఏఈ పోలయ్య

రాచర్ల: మండల గృహనిర్మాణ సంస్థ ఏఈగా బి.పోలయ్య బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఈగా విధులు నిర్వహించిన విజయకుమారి బేస్తవారపేట మండలానికి బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో పోలయ్య రాచర్ల మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

మార్కాపురం టౌన్: గీత కులాల నూతన మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈనెల 8వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో గౌండ్ల కులానికి ఒకటి, మార్కాపురం రూరల్‌లో ఈడిగ కులం వారికి ఒక మద్యం షాపు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆయా సామాజికవర్గాల వారు ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని, 10న లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తారని వివరించారు.


కాలేజి రోడ్డులో ఇరిగేషన్ కాలువ వెంట పడేసిన పూడిక


పాత లైబ్రరీ సమీపంలో తొలగించకుండా వదిలేసిన చిల్లచెట్లు, పూడిక

పూడిక తీసి.. పక్కనే పడేశారు!

కంభం: కంభం చెరువు ప్రధాన పంట కాల్వల్లోని పూడిక తీయించిన అధికారులు చాలాచోట్ల ఆ మురుగును అక్కడి నుంచి తొలగించక పోవడంతో ప్రజలు తీవ్ర దుర్గంధం ఎదుర్కొంటున్నారు. గత నెలలో సుమారు 38 లక్షల రూపాయలతో కంభం చెరువు ప్రధాన పంట కాల్వల్లో పూడిక తీసే కార్యక్రమం చేపట్టారు. పంట కాల్వలు పట్టణంలోని నడిబొడ్డు నుంచే వెళ్తున్నాయి. జేసీబీలతో కాలువల్లోని మురుగు తీసి కాలువలకు ఇరువైపులా వేసి ఆ తర్వాత కొన్నిచోట్ల ఆ మురుగును ట్రాక్టర్ల ద్వారా దూరంగా తీసుకెళ్లి పడేశారు. బస్టాండ్ వెనుక, కాలేజ్ రోడ్డు, పాత బస్టాండు సమీపంలో, స్టార్ సినిమాహాలు వెనుక ఉన్న కాల్వల్లో మురుగును తీసి పక్కనే వేసి అలాగే వదిలేయడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆ మురుగు మళ్లీ కాల్వల్లోకే పడిపోతుందని స్థానికులు చెబుతున్నారు. చప్టాల కింద, ఇరుకైన ప్రాంతాల్లో ఉన్న కాల్వల్లోని పూడికను తీయకుండా అలాగే వదిలేసారని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి తొలగించిన పూడికను అక్కడి నుంచి తీసివేయాలని, అన్నిచోట్లా పూడికను తీయించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


కంభం బస్టాండ్ మూలమలుపు వద్ద కాల్వ పక్కనే పడేసిన మురుగు

చీల్చి చెండాడుతున్నా నిద్రావస్థేనా?

- గిద్దలూరు పట్టణంలో తీవ్రమైన వీధి శునకాల బెడద
- తరచూ దాడి చేస్తున్నా నిద్రావస్థలో నగర పంచాయతీ అధికారులు

గిద్దలూరు రూరల్: వీధి కుక్కలు గిద్దలూరు నగర పంచాయతీ వాసులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఎటు నుంచి వచ్చి కుక్కలు దాడి చేస్తాయోనన్న భయం చిన్నారులతోపాటు పెద్దలనూ పీడిస్తోంది. తరచూ కుక్కలు దాడి చేసి కండలు పీకుతున్నా నగర పంచాయతీ అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గిద్దలూరు పట్టణ వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. గత ఆదివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి నివాసం వద్ద 9వ తరగతి చదువుతున్న షేక్ పీరాసాహెబ్ అనే విద్యార్థిపై కుక్కలు విరుచుకుపడ్డాయి. పిక్కను పట్టుకుని కండ బయటకు వచ్చేలా కరిచాయి. ఆర్తనాదాలు చేస్తున్న ఆ బాలుడిని బంధువులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. పిక్క కండరం సగం మేర బయటకు రావడంతో వైద్యులు అంతవరకు తొలగించి కుట్లు వేశారు. ఇదిలా ఉండగా మంగళవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వీధిలో జాహ్నవి అనే చిన్నారిపై కుక్కలు దాడి చేశాయి. దీంతో ఆ చిన్నారి తల, మెడ భాగంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి కుక్కలను అతికష్టం మీద అదిలించి పాపను రక్షించారు. ఈ దృశ్యాలు స్థానికంగా ఉన్న ఓ ఇంటి సీసీ పుటేజీలో నిక్షిప్తం కాగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గిద్దలూరులో చోటుచేసుకున్న వరుస ఘటనలు పట్టణ వాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కొన్ని వీధుల్లో ఒంటరిగా బయటకు రావాలంటే చేతిలో కర్ర పట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి శునకాల బెడద నుంచి విముక్తి కల్పించేందుకు నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా..


కుక్కల దాడిలో గాయపడిన పీర్‌సాహెబ్


పీర్‌సాహెబ్ పిక్క నుంచి కుక్కలు పెకలించిన కండర భాగం


కుక్కల దాడిలో తలకు తీవ్ర గాయమైన జాహ్నవి

సర్కిల్ కార్యాలయ భవనం పరిశీలన


పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

పొదిలి: పొదిలి పోలీస్ సర్కిల్ కార్యాలయంగా పునఃనిర్మిస్తున్న స్థానిక పాత పోలీస్ స్టేషన్ భవనాన్ని బుధవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ పరిశీలించారు. తుదిదశకు చేరుకున్న పనులను పరిశీలించి, మార్పులు, చేర్పుల గురించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. భవనాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, పోలీసు సిబ్బందిని అభినందించారు. త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఆయన వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్సై వి.వేమన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మాజీ మంత్రి సురేష్ అభినందన


నందిని అభినందిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని డాక్టర్ శామ్యూల్‌జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని కె.నందిని ఇన్ఫోసిస్‌లో ఉద్యోగానికి ఎంపికవగా కళాశాల సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభినందించారు. కళాశాలలో సీఎస్ఈ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని ఇటీవల క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య తదితరులు అభినందించారు.

కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

మార్కాపురం టౌన్: మార్కాపురంలో గుండ్లకమ్మ నది ఒడ్డున వెలసిన లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. ఆలయ అర్చకుడు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష్య కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా బుధవారం రాత్రి శేషవాహనంపై స్వామివారు ఉభయదేవేరులతో కలిసి భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం రాత్రి 7 గంటలకు హనుమంత వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు.


ధ్వజారోహనం చేస్తున్న అర్చకులు

7న పోలేరమ్మ దేవస్థానంలో వేలం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఈనెల 7న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి బుధవారం తెలిపారు. ఆలయ పరిధిలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, టిఫిన్స్, కూల్ డ్రింక్స్ అమ్ముకునేందుకు, అలాగే కొబ్బరి చిప్పలు, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరెలు, రవికెలు పోగుచేసుకునే హక్కుకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది వ్యవధికిగాను నిర్వహిస్తున్న వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

వ్యవసాయ పరికరాల తనిఖీ

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ, గడికోట, సంజీవరాయుడుపేట, కంచిపల్లె, గిద్దలూరు, తంబళ్లపల్లె రైతుసేవా కేంద్రాల పరిధిలో పంపిణీ చేసిన వ్యవసాయ పరికరాలను ఏఓ విజయభాస్కర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. 2021–23 మధ్య కాలంలో రైతులకు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ పథకం కింద అందించిన ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. పనిముట్లను గ్రూపు సభ్యులు వాడుకుంటూ ఇతర రైతులకు అద్దెకు ఇవ్వాలని సూచించారు. రుణాలు పొందిన రైతుల జాబితా, చెల్లింపుల వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ శ్రీనివాసరెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.


గిద్దలూరు : రైతుల పనిముట్లను పరిశీలిస్తున్న ఏఓ

రోడ్డుపైకి విస్తరించిన చిల్లకంప

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల నుంచి జేసీ అగ్రహారం, కొత్తపల్లె నుంచి వంగపాడు వెళ్లే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా చిల్లకంప పెరిగింది. మూలమలుపుల్లో రాకపోకల సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. చిల్లకంప రోడ్డుపైకి ఏపుగా పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వాహనాలు ఎదురుపడితే రోడ్డు మార్జిన్ దిగేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చిల్లకంపను తొలగించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.


పిటికాయగుళ్ల-జేసీ అగ్రహారం రోడ్డుపైకి పెరిగిన చిల్లకంప

పని చేస్తూ కుప్పకూలిన ఉపాధి కూలీ

రాచర్ల: ఉపాధి పనులు చేస్తూ కూలీ స్పృహ కోల్పోయి కుప్పకూలిన సంఘటన మండలంలోని రాచర్ల ఫారంలో బుధవారం జరిగింది. రాచర్ల ఫారం గ్రామానికి చెందిన పూసలపాటి ప్రకాశం అనే ఉపాధి కూలీ గురుకుల పాఠశాల వెనుక భాగంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో స్పృహ కోల్పోయి కిందపడ్డాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తోటి కూలీలు 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి పత్తి రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు చెప్పారు.


వైఎస్ జగన్‌తో పత్తి రవిచంద్ర

కార్యకర్తలకు అండగా నిలవాలి


మాజీ ఎమ్మెల్యే అన్నాను సన్మానిస్తున్న నారాయణరెడ్డి

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు సూచించారు. పార్టీ పంచాయతీరాజ్ వింగ్ మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన టీపీ నారాయణరెడ్డి బుధవారం అన్నా రాంబాబును కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్ రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలు కార్పొరేట్ల కోసమే..



బేస్తవారిపేటలో ధర్నా చేస్తున్న సీఐటీయు నాయకులు



కంభంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

బేస్తవారిపేట: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా సంస్కరణలు అమలు చేస్తోందని సీఐటీయూ నాయకులు అబ్రహం, రాజు విమర్శించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌ను తీసుకొచ్చిందన్నారు. నూతన లేబర్‌కోడ్ చట్టాలు అమల్లోకి వస్తే కార్మికుల వేతనం, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పనిదినాలకు విఘాతం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్కీమ్ వర్కర్స్ వేతనాల పెంపుదల, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి, ఉద్యోగ భద్రతకు ఎటువంటి నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ప్రవీణ్, ఆటో యూనియన్ కార్మికులు పాండు, శ్రీను, ఆలీ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబు, తిరుపతయ్య, రమణ పాల్గొన్నారు.

కంభం: కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకుడు అన్వర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్‌కు అనుకూలంగా సంస్కరణలు అమలు చేస్తూ వారికి అనుకూలంగా మారిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘ నాయకులు రోశయ్య, కొత్తూరు, మహబూబ్ బాషా, జెర్మియా, గుర్రప్ప, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గిద్దలూరు రూరల్: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య అన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం కార్మికులకు అనేక రకాల హామీలు ఇచ్చిందని, అందులో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. సీఐటీయూ నాయకులు నరసింహులు, అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకురాలు స్వర్ణ, మున్నా పాల్గొన్నారు.

లేబర్ చట్టాలు ఉపసంహరించుకోవాలి

మార్కాపురం టౌన్: కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాల నాగయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల హక్కులను హరించే నూతన లేబర్ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్స్‌ను కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. కార్పొరేట్ సంస్థల మెప్పు పొందేందుకే కేంద్రం ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. నూతన లేబర్ కోడ్స్‌పై పార్లమెంటులో చట్టం చేయాలని అనుకోవడం దుర్మార్గపు చర్య అని దుయ్యబట్టారు. కార్మికుల హక్కులను కాలరాసే ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, రూబెన్, మండల నాయకులు, నాగరాజు, శ్రీనివాసులు, మహబూబ్ బాషా, హరి, ఇమాంసా, అల్లూరయ్య, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు


ధర్నా చేస్తున్న కార్మికులు


ఆర్టీసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలు తగదు

మార్కాపురం: ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ పిలుపునిచ్చారు. బుధవారం మార్కాపురం డిపో వద్ద నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టేందుకు మార్చి 24న ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నూతన కార్మిక చట్టాలను వ్యతిరేకించాలని, మోటారు యాక్టు చట్టంలో ప్రమాదాలు జరిగిన సందర్భంలో డ్రైవర్లకు విధిస్తున్న శిక్షలను, పెనాల్టీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం చలో పార్లమెంటు ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి జి.శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య, నాయకులు నాగరాజు, ఎస్‌కే మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుకు ప్రభుత్వ ఆస్పత్రిలో

అత్యవసర చికిత్స

కంభం: గుండెపోటు గుర్తింపు పరీక్షలు, గుండెపోటు అత్యవసర చికిత్స, ఇంజెక్షన్లు స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు వైద్యశాలలో సేవలందించనున్నారని, ఛాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడ వంటి లక్షణాలు ఉంటే వెంటనే 108 వాహనంలో దగ్గరలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని, వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మొదటి గంటలోనే రూ.40 వేల విలువైన టెనిక్టిప్లెస్ ఇంజెక్షన్ ఉచితంగా అందించి ప్రాణాలను కాపాడవచ్చని, తర్వాత సర్వజన ఆస్పత్రికి మార్చవచ్చని చెప్పారు. మొదటి గంట అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో త్రాంబో లైస్ ఇంజెక్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు నిర్లక్ష్యంగా ఉండకుండా వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలన్నారు.


ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని